# 10

# ఆత్మీయ ఎదుగుదల యొక్క అవసరత

## (5:11-6:9ఎ)

"మెల్కీసెదెకు క్రమము (6, 10 వచనాలు) చొప్పున యేసు క్రీస్తు ప్రధాన యాజకుడయ్యాడని" గ్రంథకర్త 5:1–10 వాక్య భాగంలో స్పష్టం చేస్తున్నాడు. అతడు అక్కడితో ఆగి, "నాకు ఒక సమస్య ఉంది ఎందుకంటే ఆ సమస్య మీకు ఉంది. నేను చెప్పున్నది మీకు అర్థమవుతున్నదో లేదో నాకు తెలియదు" (చూడు 11 వ.) అని చెప్తున్నాడు. ఈ విధంగా హెబ్రీ పత్రికలోని అభ్యాసమునకు అవసరమగు విషయాన్ని గ్రంథకర్త చర్చిస్తున్నాడు: అది *ఆత్మీయ ఎదుగుదల* యొక్క అవసరతకు సంబంధించిన భాగం. ఈ వచనాలను చదువుచుండగా, కాలం అంతగా మారదు అన్న సత్యమును మనం గమనించగలము. ఈ నాడు కూడ ఆత్మీయ ఎదుగుదల అవసరం ఎంతో ఉంది.

### అప్పుడు ఎలా ఉండేది: వారు ఎదగడంలో విఫలమయ్యారు (5:11–14)

ఇది ఎవరినుద్దేశించి వ్రాయబడిందో వారు ఆత్మీయంగా బాల్య దశలోనున్నవారు (13 వ.). వారింకను చిన్నపిల్లల ఆహారం తీసుకుంటున్నవారు (12 వ.). వారు ఎదుగక పోవడానికి గల అనేక కారణాలను మన వాక్యభాగం చూపిస్తుంది.

#### ఎలా చదవాలో వారికి తెలియదు (5:11).

వారు "వినుటకు మందులైయున్నారు" (11 వ.). "మందత్వం" (dull) అనేది 6:12లో వాడబడిన "సోమరితనము" అను పదమునకు వాడబడిన సమాన గ్రీకు పదం వాడబడింది. వారు నేర్చుకోవడంలో సోమరులు. నేర్చుకొనుటకు వారు చేయవలసిన ప్రయత్నం చేయడం లేదు. శ్రద్ధగా వినడానికి ప్రయత్నించాలి. కొంతమంది బైబిలు తరగతులు లేదా ఆరాధనలు నిరుత్సాహంగా ఉన్నాయని వాపోతుంటారు. అయితే సమస్య వాటిలో లేదు గాని, చెప్పబడుచున్న వాటిని వారు శ్రద్ధగా వినడం లేదు. ఆత్మీయ సంబంధమైన ప్రతి కార్యక్రమం నిరుత్సాహంగా ఉందనిపిస్తుంటే సమస్య వాటిలో గాక వారిలోనే ఉంది.

#### ఎలా బోధించాలో వారికి తెలియదు (5:12ఎ).

పత్రికలో ఉద్దేశించబడిన వారికి బోధించే సామర్థ్యం లేదు. వారికి బోధనయందు ఆసక్తి ఏ మాత్రం లేదు. మనమందరమూ బోధకులు కావలసియుంది (మత్తయి 28:19, 20). అంటే మనమందరం తలాంతులుగల ఉపదేశకులము గానక్కరలేదు – గాని, మన విశ్వాసాన్ని ఇతరులతో పంచుకునేంత ఉద్దేశ సామర్థ్యం మనలో ఉంటే చాలు. ఎందుకంటే, ఈ సామర్థ్యం ఒక తలాంతు (రోమీయులకు 12:7).

**మరింతగా నేర్చుకొనుట వారికిష్టము లేదు (5:12బి, 13).**

వాక్య విషయంలో కష్టతర అంశాలను గురించి వ్యవహరించడం పట్ల ఈ ఆత్మీయ "శిశువులకు" ఆసక్తిలేదు. వారు నేర్చుకోవడం మానుకున్నారు. లేఖన పరిజ్ఞానంలో, పెంపొందడానికి ప్రయత్నించడం కూడా వారు మానుకున్నారు.

**మేలు కీడులను వారు వివేచించలేరు (5:14).**

నేపథ్యాన్ని పరిశీలిస్తే, మంచి బోధన మరియు అబద్ధ బోధనలను గురించి వివేచించడమును గురించి గ్రంథకర్త ప్రత్యేకించి చెప్తున్నాడు. చిన్న పిల్లలు అన్నిటిని తమ నోట్లో పెట్టుకొనుటకు ప్రయత్నించినట్లు, ఆత్మీయంగా ఎదుగని ఈ శిశువులు కూడ అబద్ధ బోధకులు చెప్పే విషయాలను తమ హృదయంలో ఉంచుకుంటున్నారు.

### ఇప్పుడు ఎలా *ఉండాలి:* సంపూర్ణులుగా వారు ఎదగాలి (6:1-3)

**సవాలు (6:1, 2)**

"క్రీస్తునుగూర్చిన మూలోపదేశము మానుకొనుము" (1 వ.) అని గ్రంథకర్త తన పాఠకులకు సవాలు చేస్తున్నాడు. "మొదటి సూత్రములు" అని ASV పేర్కొంటుంది. వీటిని సువార్త యొక్క "అ, ఆ, ఇ, ఈ" లుగా మనం భావించవచ్చు. యేసుని మరణము, పునరుత్థానం, దానికి మనం విధేయత, విశ్వాసం ద్వారా ఎలా ప్రతిస్పందించాలి అన్న విషయములు మొదటి సూత్రములు అని మనం భావిస్తుంటాము (మార్కు 16:15, 16; మత్తయి 28:18-20). హెబ్రీయులకు 6:1, 2 వాక్య భాగంలో చెప్పబడిన అంశాలు మనకు "కష్టతర" అంశాలుగా కన్పిస్తాయి కానీ, గ్రంథకర్త వీటిని "మూలోపదేశములుగా" పిలుస్తున్నాడు. ప్రథామిక విషయాలను ధ్యానించడం మానుకోవడం గ్రంథకర్త ఉద్దేశం కాదుగాని, వాటిని అప్పుడప్పుడు ధ్యానించడం మంచిదే గాని వాటినే ఎల్లవేళలా పట్టుకు వేలాడడం మంచిది కాదు. అవి పునాదులవంటివి; వాటి ఆధారముగానే మన బైబిలు పరిజ్ఞానాన్ని నిర్మించుకోవాలి.

సంపూర్ణులు కమ్మని, *ఎదుగమని* గ్రంథకర్త తన పాఠకులను కోరుతున్నాడు. మన ఆలోచనలలో, మన కార్యములలో మనం ఎదగాలి (చూడు 1 కొరింథీయులకు 13:11). దేవుని సంఘం ప్రతిచోట సహజంగా ఎదుర్కొంటున్న సవాలు ఇది!

**సమర్పణ (6:3)**

సంపూర్ణులుగా ఎదుగమని గ్రంథకర్త తన పాఠకులను కోరిన తరువాత వారితో తనను కలుపుకుంటున్నాడు. "దేవుడు సెలవిచ్చినయెడల మనమాలాగు చేయుదము" (3 వ.) అని అంటున్నాడు. మనందరి ప్రతిస్పందన ఇదే కావాలి!

### ముమ్ముందు ఎలా ఉంటుంది (వారొకవేళ ఎదుగకపోతే) (6:4-9ఎ)

**ఏం జరుగుతుంది**

6:4-8లో పూర్తి విశ్వాస భ్రష్టత్వ స్థితిని గురించిన వివరణ గ్రంథకర్త యిస్తున్నాడు.

క్రైస్తవులు *కొట్టుకొని పోగలరని* (2:1) మరియు *విడిచిపెట్టేయగలరని* (3:12; KJV చూడు) అతడు ఇంతకు ముందే చెప్పాడు. వారు మాంద్యులు కాగలరని 5:11లో హెచ్చరిస్తున్నాడు.[1] ఇటువంటప్పుడు వారు నాశనమునకు వెళ్లుతున్నారు. ఎవరు కూడ ఆత్మీయ స్థితిలో నిలకడగా ఉండలేరు. మనం ముందు వెనకకు ఊగుతుంటాము. మనం ఎదుగనట్లయితే, మనం విశ్వాస భ్రష్టులమై పోగలం!

**ఇలా ఎవరికి జరుగుతుంది**

దేవుని యొక్క పిల్లలు పడిపోలేరు కాబట్టి 4 నుండి 6 వాక్యభాగం క్రైస్తవులకు వర్తించదు అని కొంతమంది వాదిస్తుంటారు. కానీ ఇది చెప్పబడింది క్రైస్తవులకే. నిజానికి, వారు స్థిర విశ్వాసులు. ఒకప్పుడు వారు ...

- "వెలిగింపబడ్డారు" (4 వ.; చూడు 10:32).
- "పరలోక సంబంధ వరమును రుచి చూశారు" (4 వ.; చూడు 2:9).
- "పరిశుద్ధాత్మలో పాలివారయ్యారు" (4 వ.; చూడు అపొస్తలుల కార్యములు 2:38).
- "దేవుని దివ్య వాక్యమును రుచి చూశారు" (5 వ.; చూడు 2:9).
- "రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించారు" (5 వ.).[2]

ఈ పత్రిక ఎవరినుద్దేశించి వ్రాయబడిందో ఆ క్రైస్తవుల విషయంలో ఈ మాటలు సత్యములు అయినా గాని, వారింకనూ విశ్వాస భ్రష్టులు కావచ్చు. "... మీరింతకంటె మంచి స్థితిలోనున్నారని రూఢిగా నమ్ముచున్నాను" (9 వ.) అని గ్రంథకర్త వ్రాస్తున్నాడు. మరో మాటలో చెప్పాలంటే, "ఇటువంటి స్థితి మీకు కలుగుతుందని నేను అనుకోవడం లేదు గాని, యిలా *జరుగవచ్చు*" అని చెప్తున్నాడు (చూడు 1 కొరింథీయులకు 10:12). దేవుని సహాయంతో మనం ఎదుగునట్లు ఆయన్ను అడుగుదాము (6:3)!

---

**ఉపదేశకులకు సూచనలు**

ఈ వాక్య భాగమునే "ఎదుగుదల లేకపోవడం అనే ప్రమాదం" అనే అంశముగా చెప్పవచ్చు. ఈ అంశములో వీటిని భాగంగా చెప్పవచ్చు.

(1) *నిరుత్సాహపడడం అనే ప్రమాదం* (5:12-14). ఈ వాక్య భాగం ద్వితీయ పురుషలో వ్రాయబడింది ("మీరు"). ఇది పాఠకుల సమస్యను గురించి తిన్నగా ప్రశ్నిస్తుంది: వారు దేవుని వాక్యమును నిర్లక్ష్యము చేశారు గనుక వారు ఎదుగలేక పోయారు.

(2) *శిశువుల గానే మిగిలిపోయే ప్రమాదం* (5:12-14). శిశువులవలె మిగిలిపోవడం అనేది సంఘంలో ఒక ప్రధాన సమస్య. "... క్రీస్తువలె ఉండుటకు మనమన్ని విషయములలో ఎదుగుదుము" (ఎఫెసీయులకు 4:15; చూడు 2 పేతురు 3:18).

(3) *అజ్ఞానులవలె మిగిలిపోయే ప్రమాదం* (5:12-6:3). ఈ పత్రిక పాఠకులు దేవుని వాక్య విషయంలో అజ్ఞానులు (5:12-14). ప్రాథమిక ఉపదేశముల విషయంలోనే వారు అవివేకులు (5:12; 6:1-3).

(4) *నిష్ఫలులైయుండే ప్రమాదము* (6:4–8). ఒక భూ భాగము వర్షమును స్వీకరించి ఫలములను ఇస్తుంది (7 వ.). మరియొక భూభాగము అదే ఆశీర్వాదమును పొంది ముండ్ల పొదలను, గచ్చ తీగలను ఇస్తుంది (8 వ.). ఇదే విషయం దేవుని ఆశీర్వాదం విషయంలోనూ సత్యము. ఆశీర్వాదములను పొందిన తరువాత, నిష్ఫలులమైపోయే అవకాశం ఉంది.

(5) *నశించిపోయే ప్రమాదం* (6:4–8). దేవుని ఆశీర్వాదం పొంది ముండ్ల పొదలు, గచ్చ తీగలను ఇచ్చిన భూమి నిష్ఫలమైపోయి, పనికి రానిదని విసర్జింపబడి శాపము పొంది తుదకు కాల్చివేయబడుతుంది (8 వ.). మనమూ ఆత్మీయంగా ఎదుగకపోతే ఏం జరుగుతుందో తెలియజెప్పే సాదృశ్యం ఇది!

---

సూచనలు

[1]Adapted from Warren W. Wiersbe, *The Bible Exposition Commentary,* vol. 2 (Wheaton, Ill.: Victor Books, 1989), 299. [2]ఇది పరలోకమును సూచించవచ్చు కానీ ఇది క్రైస్తవ తరమును కూడ సూచిస్తుంది. “రాబోవు యుగసంబంధము” అనే మాట యూదులు మెస్సీయా తరమును సూచించుటకు వాడుతారు.